క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయాభివృద్ధికి రూ. లక్ష విరాళం



ఆలయ మాజీ చైర్మన్‌కు నగదు అందజేస్తున్న దాత తల్లిదండ్రులు బుడ్డా ఈశ్వర్‌రెడ్డి దంపతులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బుడ్డా ఈశ్వర్‌రెడ్డి, తులశమ్మ కుమారుడు బుడ్డా రాహుల్‌కుమార్‌రెడ్డి, నిహారిక దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు విరాళం నగదును గురువారం ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డికి దాత తల్లిదండ్రులు అందజేశారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆసరా ఉత్సవాల వేదిక మార్పు

కోవెలకుంట్ల: పట్టణంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన మూడవ విడత వైఎస్సార్ ఆసరా ఉత్సవాల వేదికను మార్పు చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. ముందుగా పట్టణ శివారులోని వీరభద్ర ఫంక్షన్‌హాలులో ఉత్సవాలు జరపాలని నిర్ణయించామన్నారు. అయితే ఫంక్షన్ హాలు దూరంగా ఉండటంతో మహిళలకు అనుగుణంగా వేదికను స్థానిక మార్కెట్ యార్డు ఆవరణకు మార్పు చేశామన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 655 పొదుపు గ్రూపులకు రూ. 3.74 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఆసరా ఉత్సవాలకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరువతున్నారన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.11కోట్లతో వివిధ పనులు జరిగాయన్నారు. ఆయా పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు విచారణ చేపట్టి గ్రామసభలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ మేరకు చేపట్టనున్న బహిరంగ సభకు డ్వామా ఉన్నతాధికారులు హాజరవుతారని చెప్పారు.

నేటి నుంచి తిరునాల

బేతంచెర్ల : పట్టణానికి సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీమాత తిరునాల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయని నిర్వాహకులు గౌరిహుసేన్‌రెడ్డి తెలిపారు. 31వ తేదీ రాత్రి గ్రామ దేవత సుంకులమ్మ ఆలయం నుంచి అమ్మవారి జ్యోతుల మహోత్సవం సాగుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీన ఉదయం బోనాల సమర్పణ ఉంటుందన్నారు. ఏప్రిల్ 2న రాష్ట్రస్థాయి ఆరు, ఆరుపండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు అందచేస్తామన్నారు.

గుడి నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కాటసాని ప్రసాదరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని బానుముక్కల అర్బన్ కాలనీలో గురువారం శ్రీసీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి రోజునే ఈ ఆలయానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంత సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తమ్మడపల్లె సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వేములపాడు మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, భానుముక్కల సింగిల్ విండో అధ్యక్షుడు నీలి శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ ఈసారి యల్లయ్య, వెంకట్రామిరెడ్డి, విఘ్నేష్, దర్గాప్రసాద్, కిశోర్, పోలూరుదస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ సేవకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఏప్రిల్ 4న ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమానికి వలంటీర్‌గా సేవలు అందించేందుకు ఆ సక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని మన ఊరు–మన గుడి, మన బాధ్యత కా ర్యక్రమం నిర్వాహకులు శివప్రసాదరెడ్డి, రాంప్ర సాద్ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రవచన కార్యక్రమ నిర్వహణకు 1,000 మంది వ లంటీర్లు కావాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 8074643715, 9949377662లను సంప్రదించాలన్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళలు



సీతారాముల కల్యాణం...



ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం



స్వామివారి కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

- వైభవంగా సాగిన సీతారాముల కల్యాణోత్సవం
- ముత్యాలతో తలంబ్రాలు
- గుళ్లదూర్తిలో భద్రాది తరహాలో వేడుకలు



ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: శ్రీరామ నవమి పండగను పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట, ముదిగేడు చౌరస్తా, శ్రీరాంనగర్, సీతారామనగర్, గాంధీనగర్‌తో పాటు భీమునిపాడు, కంపమల్ల, కలుగొట్ల, జోళదరాశి, లింగాల, రేవనూరు, వెలగటూరు, బిజనవేముల, అమడాల, సొదరదిన్నె తదితర గ్రామాల్లో వెలసిన రామాలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతాదేవి, శ్రీరాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

భద్రాది తరహాలో కల్యాణ వేడుకలు

మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలోని సీతారామాశ్రమంలో భద్రాచలం తరహాలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. ముందుగా ప్రధాన అర్చకులు రామకృష్ణ, రామాచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞం, హోమం, విష్ణుసహస్రనామార్చన నిర్వహించారు. కల్యాణానికి గ్రామానికి చెందిన అన్నయ్య, దేవమునెమ్మ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందజేశారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంతోపాటు పొట్టిపాడు, అల్లూరు, కోవెలకుంట్ల, క్రిష్టిపాడు తదితర గ్రామాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి దంపతులు స్వామి వార్ల కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన మహిళలకు గాజులు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీరామ నవమి పండగను పురష్కరించుకుని ఆశ్రమ ఆవరణలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తిరునాల మహోత్సం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లోని రామాలయాల్లో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. గుండ్లశింగవరంలోని రామాలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మల చేతుల మీదుగా సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సమేతంగా మేలతాళాలతో ఊరేగింపుగా ఆలయం చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామమైన గుండ్లశింగవరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. మారెమ్మ, చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణాలకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న రంగనాయక స్వాముల వారి ఆలయానికి రూ.1.78 కోట్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబుల్‌రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, గుండ్లశింగవరం ఉపసర్పంచ్ ఆది నారాయణ రెడ్డి, నాయకులు ఉమ్మడి పెద్ద మునిరెడ్డి, ఉమ్మడి రామపుల్లారెడ్డి, చిట్టెం మద్దిలేటి రెడ్డి, సంగిరెడ్డి గారి శివారెడ్డి, కాటసాని శివారెడ్డి, కాట సాని అంకాల్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, నారెడ్డి చిన్న ఈశ్వర్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, నారప్ప గారి శివారెడ్డి, కాటసాని లక్ష్మీ రామిరెడ్డి, కశిరెడ్డి అయ్యపు రెడ్డి, చిన్న అంకాల్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

రమణీయం... సీతారాముల కల్యాణం

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బనగానపల్లె పట్టణంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ జీర్ణోద్ధారణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీసీతరాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారాముల కళ్యాణానికి అవసరమగు తలంబ్రాల బియ్యాన్ని పూర్వీకుల సంప్రదాయం మేరకు పట్టణంలోని నాగులకట్ట వీధిలో ఉన్న కరణం వెంకట్రామయ్య కుమారులు దామోదర్, గంగాదర్ దంపతుల ఇంటి నుంచి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను మండపంలో ఆశీనులుగావించారు. పెళ్లి పెద్దలుగా సీతమ్మ తరుపున నూకల విజయకుమార్, వాసంతి దంపతులు, శ్రీరాముడి తరుపున ఎంపీటీసీ సభ్యుడు యడమకంటి బాల మద్దిలేటిరెడ్డి, రాజశేశ్వరి దంపతులు వ్యవహరించగా అర్చకులు సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తాడిపత్రికి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. సాయంత్రం గ్రామోత్సవం సందర్భంగా రాయచోటికి చెందిన రవితేజా బృందం చెక్క బజన అలరించింది.

కల్యాణం...చూసిన కనులదే భాగ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లతో పాటు గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అంకిరెడ్డిపల్లెలోని రామాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కనుల పండువుగా నిర్వహించారు. ఆదర్శ దంపతులకు ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా రెండు గంటల పాటు కల్యాణం జరిపించారు. మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామి కల్యాణాన్ని తిలకించారు. కేపీ ఆధ్వర్యంలో మహిళలకు పండ్లు, రవికెలు పంపిణీ చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు తిరుపతి లడ్డును ప్రసాదంగా అందజేశారు. సాయంత్రం గ్రామోత్సవం సందర్భంగా తిరుపతి సంగీత కళాశాలకు చెందిన నాదస్వర కళాకారుల బృందం వాయిద్యాలతో పాటు తెలంగాణాకు చెందిన కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన మహిళా డప్పు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

పెట్నికోటలోని రామాలయంలో సీతారాములకు జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామ పెద్దలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం గ్రామోత్సవంలో భాగంగా జెడ్పీ చైర్మన్ స్వామివారి పల్లకీ మోశారు. సీతారాముల కల్యాణాన్ని లోకమంతా ఆచరిస్తుందని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. శ్రీరాముడి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

డోన్ : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. డోన్ వెంకటేశ్వర ఆలయంలో ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు,రజనీ కుమారి, శ్రీనివాసరావులు వధూవరు లు సీతారాములకు పెళ్లి పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ ప్రధాన అర్చకులు రాముశర్మ, శ్రీకాంత్ శర్మల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు హరి శర్మ, ధర్మకర్త నాగార్జున, వెంకట్రాముడు, శివరామ్మూర్తిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

డోన్ మండలం 44వ జాతీయరహదారి కొత్తకోట వద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. డోన్ సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు తిరునాంపల్లె తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణోత్సవానికి కొత్తకోట సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

పాతపేట రాముల దేవాలయంలో...

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేట రాముల దేవాలయంలో గురువారం శ్రీసీతారాముల కల్యాణం కనుల పండుగగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు శ్రీరాముడు, సీతాదేవిల తరుపున పెద్దలుగా వ్యవహరించి తరలివచ్చిన భక్తుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలితో పాటు గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కిందిగేరిలోని రాముల దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. స్థానిక పలకచింతమాను ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో గుండా సత్యనారాయణ, శ్రీధర్ గుప్త, దామోదర గుప్త ఆధ్వర్యంలో, బైటిపేట సమీపాన వెలసిన గాడుబావి వీరాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, పారిశ్రామిక వేత్తలు మారుతి కృష్ణ, వంక దారి కిరణ్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు, చెన్న కేశవ స్వామి ఆలయంలో బుగ్గన సోమశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది.



శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి కల్యాణం తిలకించేందుకు తరలివచ్చిన మహిళలు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లెంపల్లెలో ఇరు వర్గాల ఘర్షణ

డోన్ : మండల పరిధిలోని మల్లెంపల్లె గ్రామంలో గురువారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు స్వల్పంగా గాయపడినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. శ్రీరామనవమి పర్వ దినం సందర్భంగా ఒక వైపు ప్రజలు రామాలయం వద్ద సీతారాముల కల్యాణం తిలకిస్తుండగా మరో వైపు ప్రాంతంలో సుధాకర్ అలియాస్ ఎర్ర సుంకన్న, సు. దీర్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకోంది. అయితే ఈ వివాదం రగిలి వాల్మీకులు, యాదవుల రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం రాళ్లు, పట్టుడు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. సకాలంలో పోలీసులు స్పందించి హుటాహుటిన గ్రామానికి చేరుకోని ఇరు వర్గాలను చెదరగొట్టి సముదాయించారు. ఓ వర్గానికి చెందిన ఎస్సీ సుంకన్నయాదవ్‌తో పాటు ఇద్దరు, మరో వర్గానికి చెందిన బోయ కొక్కు రాజుతోపాటు ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయని రూరల్ ఎస్ సురేష్ తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాల్లో ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదన్నారు. సమగ్ర విచారణ జరిపి ఘర్షణకు కారణమైన వారిని గుర్తించిన అనంతరం తామే ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వివరించారు. గ్రామంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ప్యాపిలి సీఐ శ్రీరాములు, డోన్ అర్బన్, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు

కొలిమిగుండ్ల: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కనకాద్రిపల్లెలో నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీఆర్ రామిరెడ్డి, అనంతపురం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, పారిశ్రామిక వేత్తలు వీఆర్ లక్ష్మిరెడ్డి, పుచ్చా వెంకట మల్లారెడ్డి, ఎస్సీ అంకిరెడ్డి, గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన పోటీల్లో ట్రాక్టర్ డ్రైవర్లు 60 మంది పాల్గొన్నారు. నందిపాడుకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచాడు. మీర్జాపురానికి చెందిన నరసింహుడు రెండవ, కొలిమిగుండ్లకు చెందిన రమేష్ మూడవ స్థానం, పెట్నికోటకు చెందిన రామ్మోహన్ నాల్గవ స్థానంలో నిలిచారు. విజేతలకు నంద్యాల నంది మహేంద్ర, అనంతపురం జిల్లాకు చెందిన వినాయక మోటార్స్‌కు చెందిన మహేంద్ర ట్రాక్టర్స్ తరపున వరుస గా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మన్న,నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపా ల్‌రెడ్డి,పెద్దిరెడ్డి, మద్దిలేటి, వెంకట శివారెడ్డి, మాజీ సర్పంచ్ పెద్ద వెంకటేష్ పాల్గొన్నారు.

తాటి నుంజలకు భలే గిరాకీ!



బేతంచెర్లకు వచ్చిన తాటినుంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

బేతంచెర్ల: ఈ ఏడాది మార్చి ప్రారంభం నుండే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. పగటి పూట ఉష్ణోగ్రతలు ఎక్కువై ఎండ వేడిమికి ప్రజలు తల్లడిల్లుతున్నారు. భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానియాలు, వివిధ రకాల పండ్లరసాలను సేవిస్తున్నారు. ప్రత్యేకించి తాటి నుంజలు కొనేందుకు జనం పోటీ పడుతున్నారు. డోన్, బనగానపల్లె పరిసర ప్రాంతాల నుంచి బేతంచెర్లకు వచ్చే తాటినుంజలకు భలే గిరాకీ పెరిగింది. డజను తాటి నుంజలను రూ.60 విక్రయిస్తున్నారు. అదేవిధంగా కలింగరపండ్ల, కరబూజ తదితర పండ్ల విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి.

కంబయ్య ఉత్సవాలకు వేళాయె...

- ఏప్రిల్ 2 నుంచి లక్ష్మీ కంబగిరిస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు
- 6న కనుల పండువగా సాగనున్న శ్రీవారి కల్యాణం



స్వామివారి ఆలయం (ఫైల్)


అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఎర్రమల కొండల్లోని జక్కలేరువాగు ఒడ్డున ఉడుము రూపంలో స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి భక్తుల కొంగు బంగారంగా సుప్రసిద్ధి. ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి రోజున జరిగే శ్రీ లక్ష్మీ కంబగిరిస్వామి తిరు కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగుతాయి. చైత్రశుద్ధ ఏకాదశి నుంచి ఆరు రోజులపాటు జరిపే కల్యాణోత్సవాలు ఆలయ ధర్మకర్త చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సాగుతాయి. స్వామివారి కల్యాణం రోజు రాత్రి భక్తులు ఆలయానికి చేరుకొని అక్కడే నిద్ర చేస్తారు. ఆలయంలో నిద్రచేసి మరుసటిరోజు స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరడమే కాకుండా ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఎక్కడాలేని విధంగా ఈ ఆలయ ప్రాంగణంలో పూర్వం నుండే సప్త మండపాలు నిర్మింపబడ్డాయి. ఉత్సవాలకు డోన్, గుత్తి, తాడిపత్రి, యాడికి, రాచర్ల, ప్యాపిలి, బేతంచెర్ల, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వీరికి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా తాడిపత్రి, డోన్, బనగానపల్లె ఆర్టీసీ డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు. భక్తులకు అన్నదానం, త్రాగునీటి వసతిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఈఓ నాగిరెడ్డి తెలిపారు.

ఆలయ చరిత్ర

పూర్వం కొందరు మునీశ్వరులు ఎర్రమల కొండల్లోని జక్కలేరు ప్రాంతంలో తపస్సు చేస్తుండగా మధు, కైటభులు అనే ఇద్దరు రాక్షసులు చిత్రహింసలు పెడుతూ వారి భార్యలను చెరపట్టేవారని చరిత్ర. రాక్షసులు చేస్తున్న ఘోరాలను భరించలేక మునులు వైకుంఠంలోని మహావిష్ణువును వేడుకుంటారు. మహావిష్ణువు కంబగిరి స్వామి అవతారంలో వచ్చి ఆ ఇద్దరు రాక్షసులను సంహరించారని నానుడి. ఈ నేపథ్యంలో గొర్రెల మందలోని ఓ గొర్రెపిల్లను స్వామివారు ఎత్తుకెళ్లుతుండా గొల్లలు ఎదురుపడతారు. అప్పుడు స్వామివారి నిజస్వరూపాన్ని చూపించి మీ మందలను, మిమ్ములను చల్లాగా చూస్తాను అని చెప్పి స్నానం ఆచరించుటకు జక్కలేరులోని దైవ కొలనుకు పోవుచుండగా స్వామివారి పాదస్పర్శతో బండరాయి స్త్రీగా మారుతుంది. స్వామివారు ఒక చెట్టుకింద విశ్రాంతి తీసుకొనుచుండగా అక్కడకు వేటకు వచ్చిన సద్దలక్ష్మి అను కన్యను చూసి గాంధర్వ వివాహం చేసుకుంటాడు. ఇది చూసిన నారదుడు విషయాన్ని లక్ష్మీదేవికి చేరవేస్తాడు. వారిని చూసిన లక్ష్మీదేవి సద్దలక్ష్మితో వాదులాట పడుతుంది. వారిద్దరి వాదులాటను స్వామివారు చూడలేక ఉడుము అవతారమెత్తి పోవుచుండగా కుడికాలికి బొగ్గలి ముల్లు గుచ్చుకొని రక్త స్రావం జరుగుతుంది. దీంతో జక్కలేరు ఒడ్డున ఉన్న కొండగుహకు ఉడుము అవతారముతో శిల అవుతాడు. లక్ష్మీదేవి కూడా స్వామివారి ఎదురుగా జక్కలేరుకు అవతలి ఒడ్డున శిలగా మారిందని ఆలయ చరిత్ర చెబుతోంది.

2 నుంచి కల్యాణోత్సవాలు

ఏప్రిల్ 02 వ తేదీ చైత్ర శుద్ధ ఏకాదశి నుంచి శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ముందురోజు ఏప్రిల్ 01వ తేదీన ఉప్పలపాడు గ్రామంలో స్వామివారిని పెళ్లి కుమారునిగా చేసి గ్రామోత్సవం చేస్తారు. అనంతరం 02 వ తేదీన శ్రీ కంబగిరి స్వామి, లక్ష్మీదేవి, సద్దలక్ష్మిల ఉత్సవ మూర్తులను ఉప్పలపాడు నుంచి పల్లకీలో కొండపైకి తీసుకెళ్తారు. 03న చైత్ర శుద్ధ ద్వాదశిలో హనుమత్ వాహనం, 04న చైత్ర శుద్ధత్రయోదశిలో గరుఢ వాహనం, 05వ తేదీన చైత్ర శుద్ధ చతుర్ధశిన గజవాహనాల్లో స్వామివారిని ఊరేగిస్తారు. అదే రోజు శ్రీవారి తరపువారు కొండపైకి చేరుతారు. 06వ తేదీ చైత్ర శుద్ధ పౌర్ణమిలో ఉదయాన్నే వేద పండితులచే శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. సాయంత్రం కల్యాణమూర్తుల రథోత్సవం నిర్వహిస్తారు. 07వ తేదీన చైత్ర బహుళ పాడ్యమి సాయంత్రం పారువేట నిర్వహించి, రాత్రికి ఉత్సవమూర్తులు ఉప్పలపాడు గ్రామానికి చేరుస్తారు. అక్కడ ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.



ఉడుము రూపంలో వెలసిన లక్ష్మీ కంబగిరి స్వామి

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం



ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామివారికి భక్తుల ఆధరణ ఎక్కువ. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డోన్, బనగానపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో కూడా భక్తులకు మౌలిక వసతుల పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఆలయ ధర్మకర్త చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి